క్లుప్తంగా

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న సంఘం బాధ్యులు

నారాయణఖేడ్: అంబేడ్కర్ భవన్‌కు ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణం, హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయాలని కోరుతూ అంబేడ్కర్, పూలే సేవాసమితి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ రహీం, పండరి సోమవారం ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా, స్థానిక బాధ్యులు అఖిల్, ప్రభాకర్, కుమార్, నర్సింహులు, భీంసేన పాల్గొన్నారు.

సిద్ధివినాయక ఆలయంలో భక్తుల సందడి



క్యూలో నిల్చున్న భక్తులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులోని సిద్ధివినాయక ఆలయంలో సోమవారం సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి తరలిరావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. జిల్లాలోని నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రాలకు చెందిన భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లో ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్న బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన నిర్వాహణకు చిమ్నాపూర్ సమీపంలోని స్థలాన్ని సోమవారం జెడ్పీటీసీ మల్లికార్జున్‌పాటిల్ ఆ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు బసవరాజ్‌పాటిల్, శంకర్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ విఠల్, వరము రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు వీరారెడ్డి, ఉపాధ్యక్షుడు తుకారామ్, నాయకులు ప్రశాంత్‌పాటిల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మహాత్ముల మార్గంలో నడవాలి



బొండేశ్వర మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దేవగిరి మహారాజ్

న్యాల్‌కల్(జహీరాబాద్):మహాత్మ బొంగొండేశ్వర్ మహారాజ్, మహాత్మ బసవేశ్వరుడు చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమ పీఠాధిపతి దేవగిరి మహారాజ్ అన్నారు. మండల పరిధిలోని మిర్జాపూర్(ఎన్) గ్రామంలో ఏర్పాటు చేసిన బొండేశ్వర మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అధ్యాత్మికతను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం ఎంఆర్ఎఫ్ యూనియన్ అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు హుగ్గెలి రాములు మాట్లాడుతూ కర్ణాటకలో మాదిరిగా ఇక్కడి గొల్ల, కుర్మలను ఎస్టీ జాబితాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భాస్కర్‌రెడ్డి, న్యాయవాది శ్రీనివాస్ ఖన్నా, బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి సర్పంచ్ మల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



డ్రాయింగ్ వేస్తున్న విద్యార్థులు

జిన్నారం(పటాన్‌చెరు): డిజైర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపులో విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. సోమవారం హైదరాబాద్‌లోని పలు ఐటీ కంపెనీలు విద్యార్థులకు డ్రాయింగ్, డ్యాన్స్, నాటకాలు తదితర పోటీలను నిర్వహించారు. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సమ్మర్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు డిజైర్ సొసైటీ డైరెక్టర్ రవిబాబు తెలిపారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, ప్రతిఒక్కరూ క్రీడాకారులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. మాజీ ఎంపీటీసీ ముజమ్మిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంబీఆర్ నైట్ సర్కిల్ క్రికెట్ టోర్నీ విజేతలకు సోమవారం ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ప్రభుత్వం క్రీడారంగానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల చెక్కులతో పాటు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మిబాయిరవీందర్‌నాయక్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడెం, గుమ్మడిదల, కానుకుంట, మంబాపూర్, అనంతారం, కొత్తపల్లి, నల్లవల్లి గ్రామాల్లో రూ.3.20కోట్లతో పలు అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ మూడోసారి రాష్ట్రంలో సీఎంగా కేసీఆర్ హ్యాట్రిక్ సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, వైస్ ఎంపీపీ మంజుల, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రత్నప్రసాద్

కొండాపూర్(సంగారెడ్డి): రెడ్ క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలు అభినందనీయమని సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ అన్నారు. సోమవారం తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, వృక్షశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా రెడ్ క్రాస్ సొసైటీ అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. రక్తదానంతో పాటు ఎయిడ్స్‌పై అవగాహన, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తుండటం హర్షనీయమని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ ప్రవీణ, ఉపేందర్, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్లు జగదీశ్వర్, అభిజిత్, పద్మజ, శివదీప్తి వృక్షశాస్త్ర విభాగాధిపతి విజయ అధ్యాపకులు పాల్గొన్నారు.

సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



సంగారెడ్డి మున్సిపాలిటీ: సభకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు



నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్: హైదరాబాద్ సరూర్‌నగర్ గ్రౌండ్‌లో నిర్వహించిన యువ సంఘర్షణ యూత్ డిక్లరేషన్ సభకు మాజీ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షులు సురేశ్‌షెట్కార్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివెళ్లారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): హైదరాబాద్‌లో నిర్వహించిన కాంగ్రెస్ యువ సంఘర్షన సభకు సోమవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆయా ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కౌన్సిలర్ పావనిరవీందర్, తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు పర్సా శ్యాంరావు, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షులు చిలకమర్రి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేర్వేరుగా తరలివెళ్లారు.

జిన్నారం(పటాన్‌చెరు): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన యువ సంఘర్షణ సభకు జిన్నారం, గుమ్మడిదల మండలాల నుంచి సోమవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీ మండల అధ్యక్షులు వడ్డె కృష్ణ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీతో సభకు భారీగా తరలివెళ్లారు.

సంగారెడ్డి మున్సిపాలిటీ: హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరుద్యోగ డిక్లరేషన్ సభకు సంగారెడ్డి పట్టణం నుంచి నాయకులు అనంత కిషన్, సంతోష్, జార్జ్, రాజు, యాదగిరి, నరసింహులు కౌన్సిలర్ వెంకట్‌రాజు, యూత్ కాంగ్రెస్, సోషల్ మీడియా నాయకులు అధికసంఖ్యలో తరలివెళ్లారు.

నిరుద్యోగ సైరన్‌కు తరలిన నాయకులు

పటాన్‌చెరు టౌన్: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో నిర్వహించిన నిరుద్యోగ సైరన్ సభకు ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఐఎంటీయూసీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివెళ్లారు.

కాలుష్య పరిశ్రమ ఏర్పాటు చేయవద్దు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని మద్దికుంట శివారులో ఏర్పాటు చేయనున్న కామన్ బయో మెడికల్ వేస్ట్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ నిర్వహణ కేంద్రాన్ని ఏర్పాటు చేయవద్దంటూ సోమవారం తంగడపల్లి గ్రామంలో రైతులు, ప్రజా సంఘాల నాయకులు పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల పరిశ్రమ వారు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నామమాత్రంగా తమకు అనుకూలంగా ఉన్నవారితో నిర్వహించారని ఆరోపించారు. ప్లాస్టిక్ రీసైక్లింగ్ తో దుర్వాసన, పొగతో ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వాయు, జల కాలుష్యం ఏర్పడి సమీపంలో ఉన్న పంట పొలాలు కలుషితమై పంటలు పండవని రైతులు వాపోయారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు అశోక్, అంజన్న, యాదవ్‌రెడ్డి, రాజు, నాగరాజ్, రైతులు, పాల్గొన్నారు.

లాడ్జీలు, బస్సుల్లో తనిఖీలు



నారాయణఖేడ్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

నారాయణఖేడ్: కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నారాయణఖేడ్ పట్టణంలోని లాడ్జీలు, బస్సుల్లో సోమవారం సాయంత్రం నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకట్‌రెడ్డి సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులు, లాడ్జీల్లో బసచేసిన వారి బ్యాగులను పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కర్ణాటక సరిహద్దుల్లో ఈ ప్రాంతం ఉండటంతో అక్కడ ఎన్నికలు పూర్తయ్యేవరకు తనిఖీలు నిర్వహిస్తామని డీఎస్పీ తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని మెటల్‌కుంట రైల్వేస్టేషన్‌ను సోమవారం పోలీసులు తనిఖీ చేశారు. సమీపాన కర్ణాటక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించనున్న సందర్భంగా బీదర్ నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి వచ్చే రైళ్లను తనిఖీ చేసినట్లు జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశం హద్నూర్ ఎస్ఐ వినయ్ కుమార్ తెలిపారు. తనిఖీలలో రైల్వే మాస్టర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని నందికంది గ్రామంలోని రామలింగేశ్వర ఆలయంలో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ త్యాగాలు మరువలేనివి

ఎమ్మెల్యే మాణిక్‌రావు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, నాయకులు

జహీరాబాద్ టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన త్యాగాలు మరువలేనివని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. మొగుడంపల్లి మండలంలోని గౌసాబాద్‌లో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ న్యాయవాదిగా, ఆర్థిక శాస్త్రవేత్తగా, రాజకీయ నేతగా, సంఘ సంస్కర్తగా విభిన్న పాత్రలు పోషించిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో జీకాట్ ఎండీ ఢిల్లీ వసంత్, మైనార్టీ కమిషన్ సభ్యుడు తనీవ్ర్, బీఆర్ఎస్ నాయకులు విజయమోహన్‌రెడ్డి, సర్పంచులు ఈశ్వర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ సంజీవ్‌రెడ్డి, అంబేడ్కర్ కమిటీ సభ్యులు, సమతా సైనిక్‌దళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పద్మశాలి కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన

జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని రంజోల్‌లో ఎమ్మెల్యే మాణిక్‌రావు పద్మశాలి కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్, పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు..

పట్టణంలోని బాగారెడ్డిపల్లిలో సీసీ రోడ్డు, కమ్యూనిటీ హాల్‌కు ఎమ్మెల్యే మాణిక్‌రావు శంకుస్థాపన చేశారు. బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ మొహియొద్దీన్, బండి మోహన్, శివప్ప, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సామాజిక సేవలోనే సంతృప్తి

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): సామాజిక సేవలోనే సంతృప్తి లభిస్తుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని దౌల్తాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సునీతమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు శివశంకర్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు సునీతమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం శివశంకరరావును ఘనంగా సన్మానించారు.

సీనియర్ జర్నలిస్టుకు సన్మానం

ఇటీవల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సేవా పురస్కార్ అవార్డు పొందిన మండల సీనియర్ జర్నలిస్ట్ శ్రీహరిని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, కార్మిక సంక్షేమ చైర్మన్ దేవేందర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ వావిలాల నరసింహులు, జెడ్పీటీసీ ఆంజనేయులు, పీఎస్ఏ చైర్మన్ దుర్గారెడ్డి, టీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షులు బివి శివశంకరరావు, మాజీ జెడ్పీటీసీ, ఆశయ పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దు

సంగారెడ్డి టౌన్ : రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోవద్దని టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. సోమవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏగ్రేడ్ ధాన్యం ధర రూ.2060, సాధారణం రూ.2040 చొప్పున ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీసీసీబీ వైస్‌చైర్మన్ పట్నం మాణిక్యం, నాయకులు మనోహర్‌గౌడ్, బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ రఘు, రైతులు పాల్గొన్నారు.

నేడు ఆచార్య కళాశాలలో జాబ్‌మేళా

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ హరికుమార్ తెలిపారు. 2021–22–23 అకాడమిక్ సంవత్సరాలలో ఉత్తీర్ణులైన డిగ్రీ విద్యార్థులు జాబ్‌మేళాలో పాల్గొనేందుకు అర్హులన్నారు. వివిధ కంపెనీలలో 585 వేకెన్సీలు ఉన్నాయని తెలిపారు. జిల్లాకు చెంది అర్హత కలిగినవారు ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. రెజ్యూమ్‌తో పాటు 3 ఫోటోలు వెంట తీసుకురావాలని సూచించారు.

22వ రోజుకు వీఓఏల సమ్మె



నిరసన వ్యక్తం చేస్తున్న వీఓఏలు

జహీరాబాద్ టౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన వీఓఏల సమ్మె సోమవారానికి 22వ రోజుకు చేరుకుంది. సమ్మెలో వీఓఏల సంఘం నాయకులు అన్నపూర్ణ, విజయ్‌కుమార్, అనుసమ్మ, ఆశోక్‌కుమార్, రాజ్‌కుమార్, రేణుక, అనిత, శశికళ, లక్ష్మి, సుబ్బారావు, మాజీద్ పాల్గొన్నారు.

ఝరాసంగం(జహీరాబాద్): ఝరాసంగం ఐకేపీ కార్యాలయం ఆవరణలో వీఓఏలు చేపట్టిన సమ్మె 22వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఓఏలు పాల్గొన్నారు.

రిజెక్ట్ బిల్లులను రీజనరేట్ చేయాలి

జహీరాబాద్ టౌన్: రిజెక్ట్ అయిన పెండింగ్ బిల్లులను రీజనరేట్ చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు ట్రెజరరీ అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం ఏటీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌టీఓ చారి, కొండల్‌రెడ్డిని కలిసి వినతిపత్రాలను అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో పీఆర్‌టీయూ జహీరాబాద్ మండల అధ్యక్షులు తులసీరాం రాథోడ్, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం నాయకులు వరాలు, విఠల్, స్వామిదాస్, ప్రసాద్, తుకరాం చవాన్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఎల్లమ్మ దేవాలయంలో హోమం**



మునిపల్లి(అందోల్): మునిపల్లి గ్రామంలో ఎల్లమ్మ దేవాలయంలో సోమవారం హోమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయా గ్రామాల భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.

◆ **కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని వెంకటాపూర్ శివారులో వేంకటాచల దివ్య క్షేత్రంలో పద్మావతి గోదసమేత వేంకటేశ్వరస్వామి ప్రథమ వార్షికోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ **మొరాయించిన ఆర్టీసీ బస్సు**

ఝరాసంగం(జహీరాబాద్): జహీరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నడిరోడ్డుపై ఆగిపోయింది. సోమవారం బస్సు ఝరాసంగం మీదుగా రాయికోడ్ వైపు వెళ్తుంది. ఈ క్రమంలో ఝరాసంగం ప్రధాన రహదారిపై సాంకేతిక సమస్య రావడంతో ఒక్కసారిగా బస్సు ఆగిపోయింది. బస్సు స్టార్ట్ కాకపోవడంతో ప్రయాణికులు దిగి బస్సును తోసి స్టార్ట్ చేశారు.

◆ **కేతకి సంఘమేశ్వర ఆలయంలో పూజలు**

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయంలో సోమవారం తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

◆ **నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఈనెల 11వ తేదీన సంగారెడ్డిలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర మహిళా మోర్చ మాజీ ప్రధాన కార్యదర్శి గోదావరి అంజిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

◆ **ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మీను స్థానిక కార్పొరేటర్ పుష్పనగేష్ కోరారు. సోమవారం రామచంద్రాపురం పట్టణంలోని ట్రాఫిక్‌ను పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ రామచంద్రాపురం వద్ద యూటర్న్‌ను మూసివేయడంతో వృద్ధులు, మహిళలు రోడ్డు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీంతో యూటర్న్‌ను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరగా ట్రాఫిక్ ఏసీపీ సానుకులంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్‌లు కిరణ్‌కుమార్, భాస్కర్, నాయకులు కుమార్‌గౌడ్, కిరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ **శ్రీనివాస్‌నగర్ కాలనీలో బస్తీదర్శన్**

రామచంద్రాపురం(పటాన్‌చెరు) డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో సోమవారం బస్తీదర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు వివిధ సమస్యలను కార్పొరేటర్ పుష్పనగేష్ దృష్టికి తీసుకురాగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.

◆ **రేషన్ కార్డులు అందజేయాలి**

కంది(సంగారెడ్డి): అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు అందజేయాలని సీపీఐ మండల నాయకులు ఎంఎ ఖాజా సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొత్తగా రేషన్ కార్డుల కోసం పేదలు దరఖాస్తులు చేసుకుని ఏండ్లు గడుస్తున్నా మంజూరు కావడం లేదన్నారు. అదేవిధంగా వివాహాలు చేసుకున్న వారితో పాటు చిన్నపిల్లల పేర్ల నమోదు రేషన్ కార్డుల్లో లేకపోవడంతో వారికి బియ్యం రావడం లేదన్నారు. సంక్షేమ పథకాల అమలుకు రేషన్ కార్డులను లింక్ పెట్టడంతో కార్డులు లేనివారు నష్టపోతున్నారని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన వారందరికీ రేషన్ కార్డులను అందజేయాలని కోరారు.

◆ **మల్లికార్జునస్వామికి నీలం మధు పూజలు**



జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని మాదారం గ్రామంలో సోమవారం మల్లికార్జున స్వామి జాతరలో భాగంగా చిట్కుల్ సర్పంచ్ నీలం మధు సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతరలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. స్వామివారి కృపతో ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం నీలం మధును జాతర నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎన్ఎంఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు.

◆ **హ్యాండ్లూమ్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు**

సంగారెడ్డి టౌన్ : హ్యాండ్లూమ్ టెక్నాలజీ డిప్లమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకుల అధికారి విజయ పేర్కొన్నారు. డిప్లమో కోర్సులు మూడేళ్ల పాటు శిక్షణ ఇవ్వడానికి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీ వారు ముందుకు వస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తెలంగాణకు 9 సీట్లు కేటాయించాలని, అందులో ఒక సీటును ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి రిజర్వేషన్ ఉందన్నారు. సంగారెడ్డి జిల్లాలో ఆసక్తి ఉన్నవారు పదవ తరగతి పాసై, డిప్లమా మొదటి సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు జూన్ 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని మరిన్ని వివరాలకు www.iihtbargarh.com ,email. iihtbargarh@gmail.com ద్వారా సంప్రదించాలని సూచించారు.

◆ **ఇన్‌స్పెక్టర్‌గా నరేందర్‌రెడ్డి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వచ్చిన నరేందర్‌రెడ్డి సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

◆ **సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి**

సదాశివపేట(సంగారెడ్డి): అసంఘటిత కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఈఎస్ఐ, పీఎఫ్ లాంటి సౌకర్యాలు కల్పించాలని పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ సంఘటితరంగ కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ. 20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలన్నారు. అసంఘటితరంగ కార్మికులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకురాలు అమరావతి పాల్గొన్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు మద్దతు



నారాయణఖేడ్: వంటావార్పు చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

జహీరాబాద్ టౌన్: ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంఘం, కోహీర్ మండలాల కార్యదర్శులు చేపట్టిన సమ్మెకు సోమవారం తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు బస్వరాజ్, దత్తాత్రి తదితరులు సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు అదిత్య, జిల్లా కార్యదర్శి నిషాపాటిల్, జహీరాబాద్, మొగుడంపల్లి, కోహీర్, రాయికోడ్, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల అధ్యక్షులు బీరప్ప, నవీన్, మహేష్‌గౌడ్, రజనీకాంత్, నవీన్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

నారాయణఖేడ్: ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ఆర్డీఓ కార్యాలయం ఆవరణలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరసనలో భాగంగా సోమవారం వంటావార్పు నిర్వహించారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని వీఓఏలు డిమాండ్ చేశారు.